రెక్కలు విప్పుకున్న ఉత్సాహం

ఘనంగా మొదలైన ఫ్లెమింగో ఫెస్టివల్


బీవీ పాళెం ఓడ రేవు వద్ద పడవ షికారుకు వెళుతున్న సందర్శకులు


సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఫ్లెమింగో ఫెస్టివల్ బెలూన్ ఎగురవేస్తున్న మంత్రి కందుల దుర్గేష్ ఎమ్మెల్యే విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు


ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభం సందర్భంగా సూళ్లూరుపేటలో శోభాయాత్ర



పర్యాటక హబ్‌గా పులికాట్



తడ, దొరవారిసత్రంలలో ఉన్న పర్యాటకశాఖ రిసార్ట్‌లను అందుబాటులోకి తెస్తాం. కొల్లేరుతో పాటు పులికాట్ సరస్సును పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం. పర్యావరణ పరిరక్షణతో పాటు మత్స్యకారుల సంక్షేమమూ మాకు ముఖ్యం. డిప్యూటీ సీఎం, అటవీ శాఖా మంత్రి అయిన పవన్ కల్యాణ్ దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లి ఆంక్షల సడలింపునకు కృషి చేస్తాం.

-పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్

రిసార్ట్‌లు ప్రైవేటుకు వద్దు



పులికాట్ సరస్సు పూడికతీతకు అనుమతులు వచ్చాయి. త్వరలోనే ఆ పనులు మొదలవుతాయి. ఇక్కడి రిసార్ట్‌లను పూర్తిగా ప్రైవేట్ పరం చేయకుండా ప్రభుత్వ భాగస్వామ్యంతో నడిచేలా మంత్రి చర్యలు తీసుకోవాలి.

- సూళ్లూరుపేట
ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

యువతకు ఉపాధి



సూళ్లూరుపేట, నేలపట్టు, బీవీపాలెం ప్రాంతాలను టూరిజం హబ్‌గా చేస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి. ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఇది మత్స్యకారులకూ ప్రయోజనకరం అవుతుంది. ప్రకృతి సౌందర్యంగా పర్యాటకులను ఆకర్షిస్తున్న పులికాట్ సరస్సు అభివృద్ధికి అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకొంటుంది.

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట/ తడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ శనివారం ఘనంగా మొదలైంది. మూడు రోజుల పాటు జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో ఫ్లెమింగో బెలూన్ ఎగురవేసి ప్రారంభించారు. ఉదయం సూళ్లూరుపేట హోలిక్రాస్ సర్కిల్ నుంచి ప్రభుత్వ కళాశాల మైదానం వరకు శోభాయాత్ర జరిగింది.బుట్టబొమ్మలు, మంగళ వాయిద్యాలు, కేరళ బ్యాండ్‌మేళం, కోలాట నృత్యాలతో ఈ శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్, డీఎఫ్‌వో హారిక శోభాయాత్రలో ముందు నడిచారు. అనంతరం మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను మంత్రి ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన నమూనాలను తిలకించారు. క్రీడా ప్రాంగణంలో మంత్రి క్రీడాకారులతో కాసేపు ఆడి అలరించారు. శ్రీసిటీ, షార్ స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. చిన్న బొమ్మ విమానాలను మైదానంలో ఎగురవేశారు.ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభ సమావేశంలో మంత్రి కందుల దుర్గేశ్ ప్రసంగించారు. టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్తలు కొండేపాటి గంగాప్రసాద్,తానంకి నానాజీ, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఆర్డీవో కిరణ్మయి, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ నాయకుడు ఆదినారాయణరెడ్డి తదితరులు శోభాయాత్రలోనూ, ఇతరకార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

పులికాట్‌లో..
పులికాట్ సరస్సులోని పక్షులను వీక్షించడానికి సందర్శకులు శ్రీహరికోట రోడ్డులో బారులు తీరారు. అటకానితిప్పలోని విజ్ఞానకేంద్రానికి, పులికాట్ సరస్సు వ్యూపాయింట్‌ల వద్దకు పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. జర్మనీ దేశస్థులు కొందరు ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రావడం విశేషం.

నేలపట్టులో..
నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో తొలిరోజు పర్యాటకుల సందడి ఎక్కువగా కన్పించింది. బైనాక్యులర్స్ ద్వారా పక్షులను వీక్షిస్తూ జనం సందడి చేశారు. ఇక్కడి స్నేక్ షో అందరిని ఆకట్టుకుంది.

ఉత్సాహంగా పడవ షికారు..
భీములవారిపాళెం పడవలరేవులో పర్యాటకుల సందడి పెద్దఎత్తున కనిపించింది. పర్యాటకులు పడవల్లో షికారు చేస్తూ సందడి చేశారు.

ఐదేళ్ల తర్వాత.. పండుగ ఇలాగేనా?

ఈ సారి పక్షుల పండుగకు తగినంత ప్రచారం కొరవడటంతో ప్రారంభోత్సవంలో సందర్శకులు పలుచగా కనిపించారు. దీనికి తోడు పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు కూడా పెద్దగా రాలేదు. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోని ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవడంలోనూ లోపం కనిపించింది. స్థానిక నాయకులు కూడా పెద్దగా హాజరు కాలేదు. ఐదేళ్ల తర్వాత తిరిగి మొదలవుతున్న ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవం ఆశించినంత ఘనంగా అయితే కనిపించలేదు. కేవలం ఒక మంత్రి, ఒక ఎమ్మెల్యేతోనే పక్షుల పండుగ మొదలు కావడం విశేషం. జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధులు ఎవరూ ప్రారంభ కార్యక్రమానికి హాజరు కాలేదు. ప్రతిష్ఠాత్మకమైన ఒక రాష్ట్ర పండుగ జరుగవలసినంత సంబరంగా అయితే తొలిరోజు కార్యక్రమాలు మొదలు కాలేదు.


శనివారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమం


షార్ వారిచే ఏర్పాటు చేసిన స్టాల్


శెట్టిపల్లిలో మొక్క నాటుతున్న అధికారులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

● స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో కలెక్టర్ పిలుపు

తిరుపతి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం 'స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రం చేశారు. తిరుపతిలోని ప్రకాశం పార్కులో చెత్తను తొలగించడంతో పాటు మానవ హారం ఏర్పాటు చేశారు. శెట్టిపల్లిలో చెత్తకుప్పలను తొలగించారు. రోడ్డు పక్కన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ప్రతి నెలా మూడవ శనివారం ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. క్రమం తప్పకుండా ఇంటింటి చెత్తసేకరణ, చెత్తకుప్పలు లేకుండా చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. చెత్తను తొలగించడమే కాకుండా స్వచ్ఛ గాలికోసం మొక్కలు నాటాలని కమిషనర్ మౌర్య కోరారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌కు అందరూ సహకరించాలని శాప్ చైర్మన్ రవి నాయుడు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, అనిత, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో కందులవారిపల్లె

ఉప సర్పంచి దుర్మరణం

● శేషాపురం సమీపాన శనివారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఘటన

చంద్రగిరి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో చంద్రగిరి మండలం కందులవారిపల్లె ఉప సర్పంచి రాకేష్ చౌదరి(33) దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన శనివారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కుప్పం ప్రాంతం నుంచి కొన్ని ఏనుగులు శేషాచల అడవుల్లోకి చేరాయి.శేషాపురం సమీపాన అడవుల్లోకి తిష్ట వేసిన సుమారు 12 ఏనుగులు కళ్యాణి డ్యామ్‌లో నీళ్లు తాగేందుకు వచ్చే క్రమంలో పంటలను తొక్కేస్తున్నాయి. ఒక్కోసారి అటవీ సమీపాన పంట పొలాలను తొక్కి నాశనం చేస్తున్నాయి. ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడుకోవడానికి కొంతమంది యువకులు సిద్ధమయ్యారు. మరోవైపు అటవీశాఖ సిబ్బంది కూడా రాత్రి వేళ ఏనుగులను తరిమే పనిలో ఉన్నారు. కాగా, ఏనుగుల వద్దకు వెళితే అవి తిరగబడతాయని అటవీశాఖ సిబ్బంది స్థానికులకు చెప్పినట్లు తెలిసింది. అయినా, పంటలను కాపాడుకునే ఉద్దేశంతో శనివారం రాత్రి శేషాపురం, మామిడిమాను కండ్రిగ తదితర ప్రాంతాలకు చెందిన పది మంది వరకు యువకులు వెళ్లారు. శేషాపురం సమీప పొలాల్లో వీటిని తరిమారు. ఆ సమయంలో గున్న ఏనుగు ఒకటి వెనుకబడినట్లు ఆ యువకుల్లో ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఈ యువకులను గమనించిన ఆ గున్న ఏనుగు అరవడంతో, అడవిలోకి వెళుతున్న ఏనుగుల గుంపు వెనక్కి వచ్చాయి. వీటిని చూసి యువకులు తమ చేతుల్లోని టార్చిలైట్లు ఆపేసి, పరుగుతీస్తూ చాలామంది చెట్లు ఎక్కేశారు. అయితే, ప్యాంటు, కాలికి బూట్లు ఉండటంతో మామిడిమాను కండ్రిగకు చెందిన ఐ టీడీపీ మండల అధ్యక్షుడు, కందులవారిపల్లె ఉప సర్పంచి అయిన రాకేష్ చౌదరి వెంటనే చెట్టు ఎక్కలేకపోయారు. ఆయన చేతిలో టార్చిలైటు వెలుగుతుండటం, తెల్లరంగు టీ షర్టు వేసుకుని ఉండటంతో ఏనుగులు అతడిని గుర్తించాయి. ఓ పెద్ద ఏనుగు ఆయనపై దాడి చేసి తొండంతో చెట్లకు వేసి కొట్టి, కిందపడేసి తొక్కడంతో అక్కడికక్కడే మృతిచెందారు. పరిసర గ్రామాల ప్రజలు, అటవీశాఖ సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా, మృతుడికి భార్య, మూడేళ్ల కుమార్తె ఉన్నారు.



ఏనుగుల దాడిలో మృతిచెందిన రాకేష్ చౌదరి

'అన్న'కు ఆత్మీయ నివాళి

టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లు ఘన నివాళులర్పించారు. అన్నదానం చేశారు. మహిళా వర్సిటీతో పాటు పలు చోట్ల వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.


తిరుపతిలో ఎన్టీఆర్ విగ్రహానికి హారతి ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఆ పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు

ఆత్మహత్య చేసుకున్న రైతులెందరు?

● మూడేళ్ల వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లలో జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. వారంలోపు నివేదిక పంపాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఆ పనిలో తలమునకలై ఉన్నారు. జిల్లాలో 2021-22లో 56 మంది, 2022-23లో 21 మంది, 2023-24లో 18 మంది రైతులు అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం వారి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. వారి కుటుంబాలకు ఎంతో కొంత మేలు చేయాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం వివరాలు సేకరిస్తోంది. జిల్లాలో ఎక్కువగా చంద్రగిరి, తిరుపతి రూరల్, సత్యవేడు, నాయుడుపేట, గూడూరు ప్రాంతాల్లో రైతుల ఆత్మహత్యలు ఉన్నట్లు సమాచారం. సర్కిళ్లు, స్టేషన్ల వారీగా సంబంధిత సీఐలు, ఎస్ఐల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఎక్కడెక్కడ ఎంత మంది ఆత్మహత్య చేసుకున్నారు? వాటికి గల కారణాలేమిటి? ఎంత అప్పు ఉంది? బ్యాంకుల ద్వారా ఎంత రుణం తీసుకున్నారనే వివరాలు సమగ్రంగా క్రోడీకరిస్తున్నారు.

మొగరాలలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



పాకాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మొగరాలలో కోటి రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం భూమిపూజ జరిగింది. భారతంమిట్ట నుంచి మద్దినాయనిపల్లె వరకు రోడ్డు గుంతలమయమైంది. ప్రయాణికులు అవస్థలు గమనించిన ఎమ్మెల్యే పులివర్తి నాని ఎన్ఆర్‌జీఎస్‌లో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధునాయుడు, మాజీ సర్పంచ్ ఆనందచౌదరి రాజేంద్రప్రసాద్ (చిన్న), బ్రహ్మయ్య, శ్రీనివాసులు నాయుడు, చెంగ్రాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆనందగిరి ఆలయ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే నాని



డబుల్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె ఆనందగిరి ఆలయ అభివృద్ధికి, భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని చెప్పారు. సుబ్రమణ్యస్వామి ఆలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు 600 మీటర్ల మేర నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఆనందగిరి ఆలయానికి వచ్చే భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా డబుల్ రోడ్ నిర్మిస్తున్నామన్నారు. అనంతరం వళ్లీదేవసేనసమేత సుబ్రమణ్యస్వామివారిని దర్శించుకున్నారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి నిత్యకట్ట కైంకర్యాలు నిర్వహించారు. తర్వాత ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ మునికుమార్, అర్జితం ఇన్స్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ



పాకాలలో ర్యాలీ నిర్వహిస్తున్న

పాకాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో ఈవోపీఆర్డీ శశిరేఖ, పాకాల పంచాయతీ కార్యదర్శి లావణ్యల ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందితో పరిసరాల పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల స్థాయి అధికారులు పరిసరాలను శుభ్రం చేశారు. స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఇందిరమ్మ, డిటీ అన్వర్‌బాషా, ఈవోపీఆర్డీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భాకరాపేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోమశేఖర రెడ్డి,టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, కార్యదర్శి గిరీశ్, స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్ గిరి, ఏఎవో కిశోర్ కుమార్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్: మల్లంగుంట,వేదాంతపురం,చిగురువాడ,తుమ్మలగుంట గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రామచంద్ర, పంచాయతీ కార్యదర్శులు, టీడీపీ నాయకులు,పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

భూముల రీ-సర్వేపై అపోహలు వద్దు : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామమోహన్

భాకరాపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేపై అపోహలు పెట్టుకోవద్దని ఆర్డీవో రామ్మోహన్ చెప్పారు. భాకరాపేటలో భూముల రీసర్వేపై శనివారం అవగాహన కారక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 ఏళ్లుగా రీసర్వే జరగకపోవడతో భూసమస్యలు వస్తున్నాయన్నారు. రీసర్వేతో సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సర్వే అనంతరం భూములకు ఎల్‌పీఎం నంబర్లు ఇస్తామన్నారు. భాకరాపేట గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టామన్నారు. రైతులు సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జనార్దన్ రాజు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కృపాకర్, డీటీ వాసుదేవ కుమార్, ఆర్ఐ జానకీరామ్, సర్పంచ్ భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

అలిపిరి టోల్‌గేటు వద్ద ఎస్పీ తనిఖీలు



తిరుపతి(నేరవిభాగం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ మణికంఠ శనివారం అలిపిరి టోల్‌గేటు వద్ద తనిఖీలు చేపట్టారు. కొందరు తమిళనాడు భక్తులు తిరుమలకు కోడిగుడ్లు తీసుకెళ్లి భోంచేసిన ఘటనపై తీవ్రంగా స్పందించిన ఆయన అలిపిరి వద్ద తనిఖీల తీరును పరిశీలించారు. సిబ్బంది, స్కానర్ల పనితీరుపై ఆరా తీశారు. తిరుమలకు వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిషేధిత వస్తువులు ఉంటే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. భక్తుల రద్దీ సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో తనిఖీలు చేసి అనుమతించాలన్నారు. అలిపిరి సీఐ రాంకిషోర్, విజిలెన్సు సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

కేజ్రీవాల్‌పై తిరుపతి జిల్లా యువకుడి పోటీ



న్యూఢిల్లీ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న నాగేశ్వరరావు

ఎర్రావారిపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ గ్రామానికి చెందిన దుగ్గిరాల నాగేశ్వరరావు న్యూఢిల్లీ 40వ అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై ఈయన పోటీ చేస్తున్నారు. ఈ మేరకు జాతీయ జనసేన పార్టీ తరఫున ఆయన నామినేషన్ దాఖలు చేశారు. శనివారం నామినేషన్ల పరిశీలన జరిగింది. ఆ స్థానం నుంచి మొత్తం 23 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. అందులో నాగేశ్వరరావు ఒకరు. బీజేపీ నుంచి పార్వేష్ సాహిబ్ సింగ్, కాంగ్రెస్ తరఫున సందీప్ సింగ్ బరిలో ఉన్నారు. ప్రముఖులపై పోటీ చేయడంతో నాగేశ్వర రావు ప్రచారంలో నిలిచారు. భాకరాపేట, తిరుపతిలో విద్యాభ్యాసం చేసిన దుగ్గిరాల నాగేశ్వరరావు హైదరాబాదులో ఉంటున్నారు. ఇటీవల కేరళ రాష్ట్రం వయనాడ్ పార్లమెంట్ ఉప ఎన్నికల్లో ప్రియాంకగాంధీపైనా ఆయన పోటీ చేశారు.

తిరుమలకు పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే 50 బస్సులు తిరుపతి-తిరుమల, 14 బస్సులు రేణిగుంట విమానాశ్రయం-తిరుమల మధ్య తిరుగుతున్నాయి. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా నుంచి తిరుమలకు రాకపోకలు సాగించే ఇంధనం బస్సుల స్థానే విద్యుత్ బస్సులు నడపాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు రెండో విడతగా కొనుగోలు చేసే 1,750 బస్సుల్లో 300 తిరుమలకు కేటాయించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ ప్రణాళిక, అమలు, ప్రయోజనాలపై శిక్షణకు హాజరుకావాలని అలిపిరి, మంగళం డిపోల అధికారులను ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఆదేశించింది. కాగా ప్రస్తుతం తిరుగుతున్న ఎలక్ట్రిక్ బస్సులలో చాలా వరకు లోటుపాట్లు ఉన్నట్లు గతంలోనే ఆర్టీసీ అధికారులు గుర్తించారు. వాటిని అధిగమిస్తూ కొత్త బస్సులను రూపొందించాలని అధికారులు ఆయా శిక్షణ తరగతుల నిర్వాహకులను, కంపెనీని కోరనున్నారు. తిరుమల, మంగళం డిపోలలో ఎలక్ట్రిక్ బస్సుచార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. చార్జింగ్ స్టేషన్ కోసం తిరుమలలో గ్యాస్ గోడౌన్ వద్ద స్థలం ఎంపిక చేశారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు విద్యుత్ బస్సులు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రేపటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

చంద్రగిరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు నారావారిపల్లె పశువైద్యశాల డాక్టర్ వంశీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామంలో శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శక్తిపీఠాన్ని సందర్శించిన కమలానంద భారతీస్వామి



రామచంద్రాపురరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శక్తి పీఠాన్ని విజయవాడ భువనేశ్వరి పీఠం పీఠాధిపతి కమలానంద భారతీస్వామి శనివారం సందర్శించారు. పీఠం నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి మరకతశక్తి కాళీ అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతిస్వామిలను ఆయన కలిశారు.

తిరుమలలో హీరోయిన్ మీనాక్షి చౌదరి



తిరుమల, జనవరి18(ఆంధ్రజ్యోతి): సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి శ్రీవారి దర్శనార్థం శనివారం తిరుమలకు వచ్చారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా విజయవంతం కావడంతో చిత్ర బృందం తిరుపతికి గ్రాటిట్యూడ్ పర్యటన ఖరారు చేసింది. ఇందులో భాగంగా చిత్ర హీరోయిన్ మీనాక్షి చౌదరి శనివారం రాత్రి తిరుమలలోని మైహోం అతిథి గృహానికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం ఆమె శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఘాట్‌రోడ్డులో అదుపుతప్పిన కారు

● ముగ్గురికి స్వల్పగాయాలు



తిరుమల, జనవరి18(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌రోడ్డులో శనివారం ఓ కారు అదుపుతప్పి కల్వర్టు దిమ్మెను ఢీకొంది. తిరుపతికి చెందిన ఓ కుటుంబ శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. దర్శనం పూర్తిచేసుకుని సాయంత్రం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. 12వ మలుపు సమీపంలో కారు అదుపు తప్పి కల్వర్టు దిమ్మెను ఢీకొంది. దీంతో కారులో ఉన్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ సూర్యపల్లి నంద

తిరుమల, జనవరి18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యపల్లి నంద ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు.

బస్సును ఢీకొన్న కారు

నాగలాపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి - చెన్నై జాతీయ రహదారిపై అతివేగంగా వస్తున్న కారు.. ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటన నాగలాపూరం మండలం కారణి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శనివారం తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై సత్యవేడు నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు కారణి వద్ద ఆగింది. తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న చెన్నైకు చెందిన నలుగురు కనిమొళి(30), అశ్విన్‌కుమార్(34), శ్రీనిధి(32), సతీష్‌కుమార్(40)కు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో ఉత్తుకొట్టై ఆస్పత్రికి తరలించారు. బస్సులోని ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా కొరతతో రైతుల ఇబ్బందులు



ఈ-క్రాప్ కింద వరి సాగు వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

చంద్రగిరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 21 సచివాలయాల పరిధిలో 39 టన్నుల యూరియా అవసరమవుతుందని మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ ప్రతిపాదనలు పంపారు. 14 టన్నుల ఎరువు మాత్రమే వచ్చింది. ఇటీవల వర్షాలకు పనపాకం, కల్‌రోడ్డుపల్లె, భీమవరం, తొండవాడ, దోర్నకంబాలు, గంగుడుపల్లె, మండపంపల్లె, మల్లయ్యపల్లె, శానంబట్ల గ్రామాల్లో రైతులు వరితో పాటు పండ్లు, కూరగాయలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. సకాలంలో వర్షాలు పడటంతో సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే ఇప్పుడు యూరియా దొరక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ రాయితీ పోగా 45 కేజీల యూరియా బస్తా రూ.266కు ఇస్తున్నారు. బయట మార్కెట్లో అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్తున్నారు. లేదని చెప్పడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



మండలంలో వర్షాలు కురవడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. 14 టన్నుల యూరియా వచ్చింది. మళ్లీ ప్రతిపాదనలు పంపాము. రాగానే రైతులకు యూరియా అందిస్తాం.

-విజయ భాస్కర్, మండల వ్యవసాయ అధికారి

రెండు వారాలుగా తిరుగుతున్నా



యూరియా కోసం రైతు భరోసా కేంద్రాలకు రెండు వారాలుగా తిరుగుతున్నా దొరకడంలేదు. ప్రయివేటు దుకాణాల్లో కూడా లభ్యం కావడంలేదు. అధికారులు స్పందించి సకాలంలో అందించాలని కోరుతున్నాను.

-ఉమాపతిరెడ్డి, తొండవాడ

తెలుగువారి ఆత్మగౌరవం ఎన్టీఆర్

● ఊరూవాడా వర్ధంతి కార్యక్రమాలు
● టీడీపీ నాయకుల ఘన నివాళులు





పాకాలలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని,టీడీపీ నాయకులు- చంద్రగిరిలో...

పాకాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జనం మెచ్చిన కథానాయకుడు, ప్రజానాయకుడు ఎన్టీ రామారావు అని ఎమ్మెల్యే పులివర్తి నాని శ్లాఘించారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట ఆ మహానేత విగ్రహానికి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం కోసం టీడీపీ స్థాపించి ముఖ్యమంత్రిగా పేద బడుగు బలహీన వర్గాల కోసం సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

రామచంద్రాపురరం: మండల కేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, చిన్నబాబు, జనార్దనచౌదరి, నరసింహారెడ్డి, ఉమాపతి, హరిప్రసాద్, మునిరామిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరి: టవర్ క్లాక్ వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు గౌస్ బాషా, కొండూరు ప్రవీణ్, బాలకృష్ణమూర్తి, బెల్లంకొండ రమేష్‌రాయల్, రాజులగారి వినోద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. నారావారిపల్లెలో ఎన్టీఆర్, బసవతారకం దంపతుల విగ్రహానికి గ్రామస్తులు నివాళులు అర్పించారు. తొండవాడలో ఉమాపతిరెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

భాకరాపేట: కుమ్మరపల్లెలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, సునీత, చిట్టెమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

తిరుపతిరూరల్: అవిలాలలో గ్రామ టీడీపీ నాయకులు పుష్పాంజలి ఘటించారు.

నేడు బాలరామునికి టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ

● అయోధ్యకు చేరుకున్న టీటీడీ చైర్మన్



గంగ హారతిలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, జనవరి18(ఆంధ్రజ్యోతి): టీటీడీ నుంచి తొలిసారిగా అయోధ్య బాలరామునికి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఈక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం అయోధ్య చేరుకున్నారు. బీఆర్ నాయుడు అక్కడి మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ తరుపున బాలరాముడికి పట్టువస్త్రాలు సమర్పించడం ఇదే తొలిసారి అన్నారు. ఏటా ఈ ఆనవాయితీని కొనసాగిస్తామన్నారు. ఈ అవకాశమిచ్చిన యూపీ సీఎంకు యోగీ ఆదిత్యనాథ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో ఏర్పాటు చేసిన టీటీడీ నమూనా ఆలయానికి రోజూ పదివేల మంది భక్తులు దర్శించుకుంటున్నారన్నారు. అయోధ్య సరయూ నది ఒడ్డున జరిగిన హారతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆదివారం పట్టువస్త్రాల సమర్పించాక రామ జన్మభూమి ట్రస్టు సభ్యులతో సమావేశం కానున్నారు.

టీడీఆర్ బాండ్ల జారీకి కసరత్తు

● డయల్ యువర్ కమిషనర్ పునఃప్రారంభిస్తాం: కమిషనర్ మౌర్య



తిరుపతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం జరిగిన భూ సేకరణలో భాగంగా ఎలాంటి వివాదాలూ లేనిచోట టీడీఆర్ బాండ్లు జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, త్వరలోనే ఆ ప్రక్రియను ప్రారంభిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఖాళీ స్థలాలకు కమర్షియల్ విలువ కలిగిన డోర్ నెంబర్లు వేసి టీడీఆర్ బాండ్లు జారీ చేసినట్టు కొన్ని గుర్తించాం. సర్వే నెంబర్ల ఆధారంగా ఖాళీ స్థలాల విలువను నిర్ధారించిన తర్వాతే టీడీఆర్ బాండ్లు ఇస్తాం. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పరిధిలో ఉన్న వాటికి కూడా టీడీఆర్ బాండ్లు జారీ చేసేశారు. ఇలాంటివి 167 వరకు గుర్తించాం. వీటిపై గతంలో ఎల్ఆర్ఎస్, బీపీఎస్ కోసం 170 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి అప్రూవల్ రాలేదు. వాటికి అప్రూవల్ ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. బీపీఎస్ పెండింగ్ ఉన్నవాళ్లు వినియోగించుకోవచ్చు. గతంలో ఉండే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నుంచి పునః ప్రారంభిస్తున్నాం. ఉదయం 9.30 నుంచి 10.30గంటల మధ్యన సమస్యలపై ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఇక ప్రతి నెల మూడవ శనివాసం స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. చెత్తలేని నగరంగా తిరుపతిని మార్చేందుకు అందరూ సహకరించాలి. ఫుట్‌పాత్ ఆక్రమణలను దశలవారీగా తొలగించేందుకు చర్యలు చేపడుతున్నాం. అంతర్గత రోడ్ల అభివృద్ధిపై కూడా ప్రత్యేక దృష్టి పెడుతున్నాం' అని తెలిపారు.

చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

రేణిగుంట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కరకంబాడి చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలోని కరకంబాడి చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతుందని స్థానికులు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా సుమారు 50 నుండి 55 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మృతదేహం ఉంది. కుడి చేతికి రెండు రాళ్ల వెండి ఉంగరాలు, మెడలో ఎర్రటి సాయిబాబా డాలర్ వేసుకుని ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్ తెలిపారు.

విజిలెన్స్, పోలీసు నిఘా వైఫల్యమే: వైసీపీ

తిరుపతి (జీవకోన), జనవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో విజిలెన్స్, పోలీసు నిఘా వైఫల్యం వల్లే రాంభగీచ వద్ద బిర్యానీ ప్యాకెట్లు పట్టుబడటమని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి శనివారం ఆరోపించారు. తిరుమల విషయంలో వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఏం జరుగుతుందో సమాధానం చెప్పాలన్నారు.

ఆగమోక్తంగా పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కంచు గడప వద్ద ఉన్న అధికార నందికి ఆదివారం కుంభాభిషేకం నిర్వహిస్తారు. అందులో భాగంగా శనివారం వేదపండితులు ఆలయంలో అంకురార్పణ పూజలు నిర్వహించారు. కలశాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వర స్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశ పూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

శ్రీకాళహస్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఆరుగురికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలో శనివారం పలుచోట్ల టూటౌన్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా.. మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారిని న్యాయస్థానంలో హాజరు పరచడంతో ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.60వేలు జరిమానా విధించినట్లు సీఐ వెల్లడించారు.

మనిషిని మానవీయం చేసేదే ఆదర్శం

● 'వెంటాడే జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ సభలో ప్రొఫెసర్ హరగోపాల్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మనిషిని మానవీయం చేసేదే గొప్ప ఆదర్శమని పౌర హక్కుల నేత, హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ జి. హరగోపాల్ అన్నారు. తిరుపతిలో శనివారం సీహెచ్ శివారెడ్డి రాసిన వెంటాడే జ్ఞాపకాలు పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ, 1960-80 ల మధ్య మానవీయ కలను సాకారం చేయడం కోసం ప్రపంచమంతా సంఘర్షణ జరిగిందన్నారు. తెలుగు నేలపైనా నక్సలైట్ ఉద్యమ వెల్లువ ఈ క్రమంలో వచ్చిందేనన్నారు. ఈ ప్రభావానికి లోనై, తనలోని భయాలను కూడా నిర్భయంగా చెప్పిన శివారెడ్డి అభినందనీయుడన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, యూనివర్సిటీ రోజుల్లో శివారెడ్డి పాల్గొనే ఉద్యమానికి తాను సహకరించేవాడినని తెలిపారు. తాను చేపట్టే కార్యక్రమాలకు శివారెడ్డి సలహాలు తీసుకునేవాడినని గుర్తు చేసుకున్నారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ, శ్రీశ్రీ రాసిన కరపత్రాన్ని నాటి సీఎం జలగం వెంగళరావుకు శివారెడ్డితో కలిసి తాను ధైర్యంగా ఇచ్చిన సంఘటన తలచుకుంటే ఒళ్లు పులకరిస్తుందన్నారు. ఇప్పటికీ ఈ ధైర్యం కోల్పోలేదన్నారు. స్వయం కృషితో ఆర్థికంగా, రాజకీయంగా పెద్దిరెడ్డి ఎదిగారని సభలో భూమన కొనియాడారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ సభలో ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, వైసీపీ నేత జూపూడి ప్రభాకరరావు, శైలకుమార్, సాకం నాగరాజ, వైసీపీ నాయకులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

తిరుపతి అభివృద్ధిలో ఎన్టీఆర్ చెరగని ముద్ర

తిరుపతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి, తిరుమల అభివృద్ధిలో దివంగత నేత ఎన్టీఆర్ చెరగని ముద్ర వేశారని టీడీపీ నేతలు కొనియాడారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం తిరుపతిలో ఘనంగా నివాళులర్పించారు. టౌన్‌క్లబ్ సమీపంలో గల ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాలాభిషేకం చేసి, పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు పాల్గొన్నారు. అనంతరం తిరుపతి పార్లమెంటు కార్యాలయంతోపాటు నాలుక్కాళ్ల మండపం, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పెద్దయెత్తున అన్నదానం చేశారు. వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు, టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తిరుపతి అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, శీను, కత్తి సుధ, ఈశ్వరయ్య, గోపినాథ్, సురేష్, గోవిందరాజు, రెడ్డిబాబు, అల్లాబాషా, చంద్ర, మాతయ్య, సుబ్బమ్మ, అనసూయ, సుశీల, ధనమ్మ, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో..



ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న వీసీ ఉమ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎన్టీఆర్‌కు ఘన నివాళి అర్పించారు. యూనివర్సిటీలోని ఆయన విగ్రహానికి వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కిందన్నారు. అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో..

తిరుపతి(ఉపాధ్యాయనగర్) : బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో టౌన్‌క్లబ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. విభాగం కన్వీనర్ గుండాల గోపినాథరెడ్డి రాష్ట్రానికి ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తుచేశారు. నాయకులు చిత్రపు హనుమంతరావు, కేఎస్ రాజా, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, కళాకారులు కేశవులురెడ్డి, చంద్రబాబునాయుడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

తిరుపతి (జీవకోన) : నగర పరిధిలోని తిమ్మినాయుడుపాళెం వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, నాయకులు ఆర్సీ మునికృష్ణ, మహేష్‌యాదవ్, ఊట్ల సురేంద్రనాయుడు, మహేష్, వెంకటరత్నం, రవిశేఖర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, బాల విజయ్, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

జీవకోనలో..



తిరుపతి (జీవకోన) : జీవకోన రాజీవ్‌గాంధీ కాలనీలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుమారమ్మ ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక టీడీపీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

జూఇన్‌లో..

తిరుపతి మంగళం : ఎస్వీ జూపార్కు ఎదురుగా ఉన్న జూఇన్‌లో తెలుగు యువత రూరల్ మండల ఉపాధ్యక్షుడు పాండు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వి.ఎం.శ్రీనివాసులు, దీపు, చరణ్, కిషోర్, కిరణ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో..



ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, చిత్రంలో ఆనంద్‌గౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) : ఎస్వీయూలో ఎన్టీఆర్ చిత్రపటానికి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడితో కలిసి తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ పుష్పాంజలి ఘటించారు. ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు పాలనలో ప్రాధాన్యం ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వివేక్, హరికృష్ణ, రామ్మోహన్, రాజు, లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్వచ్ఛాంధ్ర..స్వచ్ఛ దివస్



కలెక్టరేట్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శనివారం డీఆర్వో నరసింహులు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు, సిబ్బంది కలిసి కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం చేశారు. డీఆర్వో మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ మరుగుదొడ్డి, మురుగు కాలువల శుభ్రత, పల్లె, పట్టణాల్లో క్లీన్ అండ్ గ్రీన్ పాటిస్తున్నట్లు చెప్పారు. ఇకపై ప్రతినెలా మూడవ శనివారం పల్లెలు, పట్టణాలు, కార్యాలయాలు, పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. చివరిగా స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో భారతి, పద్మావతి, ప్రసాద్, హవిష, సునీత, హరిత పాల్గొన్నారు.

డీఈ కార్యాలయంలో..



డీఈ కార్యాలయంలో చెత్త తొలగిస్తున్న ఈఈలు

తిరుపతి(ఆటోనగర్) : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చునని తిరుపతి టౌన్, రూరల్ విద్యుత్ డివిజన్ల ఈఈలు వి.చంద్రశేఖరరావు, వాసురెడ్డిలు అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా డీఈ కార్యాలయ ప్రాంగణంలో చెత్తను తొలగించారు. వారు మాట్లాడుతూ కార్యాలయంతో పాటు గృహాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ మేరకు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

సచివాలయాల పరిధిలో..



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సచివాలయ కార్యదర్శి

తిరుపతి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని పంచాయతీల్లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. సప్తగిరినగర్‌కాలనీ గ్రామ సచివాలయ కార్యదర్శి జయశంకర్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం పక్కన వీధిలో చెత్త తొలగించారు. టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, ఈశ్వరయ్య, బాషా, రెడ్డిబాబు, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు. రణధీరపురం, మంగళం-2, తిరుమలనగర్, శెట్టిపల్లి సచివాలయాల కార్యదర్శులు లావణ్య, స్వాతిశ్రీ, మురళి ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు.

హెవీడ్రైవింగ్ లైసెన్స్ శిక్షణ ప్రారంభం



శిక్షణ పూర్తిచేసుకున్న వ్యక్తికి సర్టిఫికెట్ అందజేస్తున్న డీపీటీవో

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అలిపిరి డిపో కార్యాలయంలో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన డీపీటీవో జి.నరసింహులు శిక్షణ పూర్తి చేసుకున్న 30వ బ్యాచ్ డ్రైవర్లను అభినందించి, నూతన బ్యాచ్‌కు ఆహ్వానం పలికారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో డ్రైవింగ్ వృత్తికి చాలా డిమాండ్ ఉందని, బాధ్యతగా శిక్షణ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ హరిబాబు, ప్రభాకర్, రాము, గోపాల్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు కంటిచూపు మెరుగ్గా ఉండాలి



కంటి పరీక్షల శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీటీవో మురళీమోహన్, ఎంవీఐలు

తిరుపతి (జీవకోన), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే వారికి కంటిచూపు మెరుగ్గా ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలల్లో భాగంగా శనివారం ఆర్టీఏ కార్యాలయంలో వాసన్ ఐకేర్ ఆధ్వర్యంలో వాహనదారులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే సమయంలో వాహనదారులకు మనసు ఏకాగ్రత, సరిదృష్టి అవసరమన్నారు. కంటిచూపును ఎప్పటికప్పుడు పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 200 మందికి పైగా మోటారు వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి, ఆరుగురికి శుక్లాలు ఉన్నాయని గుర్తించారు. కార్యక్రమంలో జిల్లా రహదారి భద్రత వైద్యురాలు పూజావాణి ఉపాధ్యాయ, డాక్టర్ అలోక్‌కుమార్ గుప్తా, ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, స్వర్ణలత, ఏవోలు శ్రీనివాసులు, విజయ ప్రశాంతి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు ప్యాకేజీ హర్షణీయం

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించడం హర్షణీయమని పాకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జీవరత్నంరెడ్డి అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయరాదని కార్మికులు ఆందోళనలు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను గట్టెక్కించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.

వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా శ్రీలత

తిరుపతిరూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఎఫ్ఏసీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జేవీరమణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 21 నుంచి మార్చి 15వ తేదీ వరకు వర్సిటీ రిజిస్ట్రార్ సెలవుపై యూఎస్ఏ సందర్శనకు వెళ్తున్న కారణంగా డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(డీఆర్)గా వ్యవహరిస్తున్న శ్రీలతకు ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

'వాట్సాప్ పాలనలో విశ్వసనీయత ఉంటుందా?'

తిరుపతి(ఆటోనగర్), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు వాట్సాప్ ద్వారా 153 పౌరసేవలు పొందేవిధంగా పాలన సాగిస్తామని ప్రకటించారని, ఇది నమ్మశక్యంగా లేదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి విమర్శించారు. జనన, మరణ, కుల, ఆదాయ, స్థానికత, ఇంటి, కొళాయి పన్నులతో పాటు కరెంట్ బిల్లులు, భూ వ్యవహారాలకు సంబంధించి ఈసీ, అడంగల్ ఇలా 153 సేవలను ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా సెల్‌ఫోన్ ద్వారా చేసుకునే విధంగా మార్పులు చేస్తామని చెప్పడం సాధ్యమయ్యే పనేనా అని ప్రశ్నించారు. విద్యావంతులే దీనిపై అవగాహన తెచ్చుకోవడానికి సమయం పడుతుందని, చదువుకోని వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వినియోగదారుల డేటా గోప్యత, సైబర్ భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. దీనిపై సీఎం పునరాలోచించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో మురళి కోరారు.

కాపునాడు సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున



మల్లికార్జునకు నియామకపత్రం అందజేస్తున్న శివనాగేశ్వరరావు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాపునాడు సేవా సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా పెమ్మా మల్లికార్జునను నియమించినట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు మల్లెల శివ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాసరావుతో కలిసి ఆయనకు నియామకపత్రం అందజేశారు. మల్లికార్జున మాట్లాడుతూ కాపుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

శాశ్వత ప్రాతిపదికన అధ్యాపక ఖాళీలను భర్తీ చేయండి

వెటర్నరీ ఇన్‌చార్జి వీసీకి రైతు సంఘ నాయకుల వినతి



ఇన్‌చార్జి వీసీకి వినతి ఇస్తున్న రైతు సంఘ నాయకులు

తిరుపతి రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని విజయనగరం జిల్లా గరివిడి వెటర్నరీ కళాశాలలో అధ్యాపకుల ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన భర్తీచేసేలా చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ రామానాయుడు కోరారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో శనివారం వర్సిటీ పరిపాలనా భవంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీ రమణను కలసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ గరివిడి కళాశాలలో రెండు నెలల క్రితం హడావుడిగా ప్రొఫెసర్ల బదిలీలు చేపట్టి, వెంటనే డిప్యుటేషన్ పేరుతో వెనక్కి పంపడం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీసే విధంగా వర్సిటీలో పలు నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. స్వయం ఉపాధికి ఎంతో అనువైన వెటర్నరీ, డెయిరీ కళాశాలలో అధ్యాపక పోస్టుల భర్తీ, మౌలిక సదుపాయాల కల్పనలో గత ప్రభుత్వం తరహాలో మీనమేషాలు లెక్కించడం తగదని విమర్శించారు. అధ్యాపకుల కొరత విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసిక ఆందోళనకు గురిచేస్తోందని, సత్వరమే స్పందించి అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అలాగే అధ్యాపకుల సీఏఎస్ పదోన్నతులు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. నాయకులు డాక్టర్ టి.జనార్దన్, గోవిందస్వామి, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

వేద వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా తారకరామకుమారశర్మ



అభినందిస్తున్న వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఆచార్య తారకరామకుమారశర్మ నియమితులయ్యారు. ఈ మేరకు వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకూ రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన ఆచార్య రాధేగోవింద్‌త్రిపాఠి ఏడాది పాలనా కాలం పూర్తి కావడంతో ఆ స్థానంలో ఆచార్య తారకరామకుమారశర్మను నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కృష్ణ యజుర్వేద విభాగానికి చెందిన తారకరామకుమారశర్మ 2009లో ఆ విభాగంలో అధ్యాపకుడిగా చేరారు. 15 ఏళ్లగా బోధన, పరిశోధన, విస్తరణ, పాలనా రంగాల్లో సేవలు అందించారు. గతంలో కృష్ణయజుర్వేద విభాగాధిపతిగా, యూనివర్సిటీ డీన్‌గా, పరీక్షల నియంత్రణ అధికారిగా, ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఆయన్ను పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

పాఠశాల ఆవరణలో ఆత్మహత్య

రుణబాధలు భరించలేక తనువు చాలించిన టీచర్



భార్య, కుమార్తెలతో శ్రీనివాసశర్మ(ఫైల్ ఫొటో)

పలమనేరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు నార్త్ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుడు శ్రీనివాసశర్మ (54) ఆత్మహత్య చేసుకున్నారు. ఇటీవల అప్పుల బాధతో సతమతమవుతున్న ఆయన శనివారం ఉదయం పాఠశాలలో పనివుందని లోపలకు వెళ్లి వంటగది సమీపంలోని రేకుల షెడ్డుకింద ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ విషయాన్ని గుర్తించిన పాఠశాలలో పని చేసే ఓ మహిళ ఇతర ఉపాధ్యాయులకు సమాచారం అందించింది. వారు శ్రీనివాసశర్మ కుటుంబసభ్యులకు ఈ విషయాన్ని తెలిపారు.సీఐ నరసింహరాజు, ఎస్ఐ స్వర్ణతేజ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం శ్రీనివాసశర్మ భార్య శ్రీవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఆత్మహత్యకు కారణాలు దర్యాప్తులో తేలనున్నట్లు సీఐ తెలిపారు.

తిరుమలలో అలంకరణ వివాదం

● దాత ఏర్పాటు చేసిన విగ్రహాలను తొలగించిన టీటీడీ



ఆలయం ముందు ఏర్పాటు చేసిన విగ్రహాలు

తిరుమల, జనవరి18(ఆంధ్రజ్యోతి): వైకుంఠద్వార దర్శనాల సందర్భంగా తిరుమలలో ఏర్పాటు చేసిన అలంకరణ విషయంలో శనివారం వివాదం నెలకొంది. రూ.కోట్లతో అలంకరణలు చేస్తే ఎలాంటి సమాచారం లేకుండా తొలగించారంటూ ఓ దాత శనివారం ఆలయం ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా వైకుంఠ ద్వార దర్శన సమయాల్లో దాతల సహకారంతో అలంకరణలు చేయడం అనవాయితీ. పదిరోజుల పాటు జరిగే వైకుంఠద్వార దర్శనాల సమయంలో తొలిరోజు, నాలుగో రోజు, ఏడో రోజు టీటీడీ ఉద్యానవనం విభాగం నూతన అలంకరణలు చేస్తుంది. ఇందులో భాగంగా చివరిగా అలంకరణకు కర్ణాటకకు చెందిన సునీత తిమ్మగౌడ అనే దాతకు అవకాశం కల్పించారు. ఆమె వివిధ ప్రాంతాల నుంచి నిపుణులను తీసుకొచ్చి శుక్రవారం సాయంత్రం అలంకరణలు మొదలుపెట్టి శనివారం ఉదయానికి పూర్తిచేశారు. విదేశాల నుంచి తెప్పించిన పుష్పాలతో పాటు వివిధ దేవతా మూర్తుల విగ్రహాలనూ ఏర్పాటు చేశారు. తనకు సమాచారం ఇవ్వకుండా విగ్రహాలను అక్కడ్నుంచి తొలగించి, ట్రాక్టర్‌లోకి ఎక్కించారంటూ దాత సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ సిబ్బంది ఇలా వ్యవహరించడం దారుణమని, తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ కంటతడి పెట్టారు. ఆలయం ముందు ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆమెను టీటీడీ విజిలెన్స్, పోలీసులు, అధికారులు అడ్డుకున్నారు. వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపేశారు.



దాతకు నచ్చజెప్పి పంపుతున్న విజిలెన్స్, పోలీసులు, టీటీడీ అధికారులు

సంప్రదాయం కాదని..

శ్రీవారి ఆలయ ప్రాంగణంలో నమూనా విగ్రహాలను తీసుకువచ్చి అలంకరించడం సంప్రదాయం కాదని దాతలకు అర్చకస్వాములు వివరించారని టీటీడీ తెలిపింది. ఈ ఘటనపై శనివారం రాత్రి ఓ ప్రకటన ద్వారా వివరణ ఇచ్చింది. 'శనివారం ఓ దాత రంగనాయకుల మండపంలో స్వామి, దేవేరుల నమూనా విగ్రహాలను ఉంచి అలంకరణలు చేశారు. ఇలా చేయడం సంప్రదాయం కాదని దాతకు అర్చకులు వివరించారు. అర్చకుల సూచన మేరకు మిగిలిన పుష్పాలంకరణలను పూర్తిచేసి, నమూనా విగ్రహాలను దాత బయటకు తీసుకెళ్లారు. లోపల జరిగిన విషయాన్ని బయట వారితో చెప్పానని, అన్యథా భావించవద్దని దాత అధికారులను కోరారు. కేవలం టీటీడీ సూచించిన ప్రాంతంలో మినహా బయట విగ్రహాలను తీసుకొచ్చి ఆలయ ప్రాంగణంలో పల అలంకరణ చేయరాదని దాతకు సూచించాం' అని ఆ ప్రకటనలో టీటీడీ పేర్కొంది.

టెలిఫోన్ కాలనీలో చోరీ

74 గ్రాముల బంగారు.. 17 వేల నగదు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక టెలిఫోన్ కాలనీలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. రూరల్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు... టెలిఫోన్ కాలనీలో కాపురముంటున్న సురేఖ సంక్రాంతి పండుగకు గాను కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 12న స్వగ్రామమైన రొంపిచెర్ల మండలం బోనంవారిపల్లికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరన్న విషయాన్ని గమనించిన దుండగులు శుక్రవారం రాత్రి తాళాలు పగులకొట్టి 36 గ్రాముల బంగారు లాంగ్‌చైన్, 32 గ్రాముల నెక్లెస్, ఆరు గ్రాముల రెండు ఉంగరాలు, 17వేల నగదు అపహరించుకుని వెళ్లారు. తలుపులు తెరిచి ఉండడంతో ఇంట్లో బాడుగకు ఉన్న వారు ఈ విషయాన్ని సురేఖకు తెలిపారు. శనివారం ఇంటికి చేరుకుని పరిశీలించగా చోరీ జరిగిందని నిర్ధారించుకుని తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మహాకుంభమేళాలో వైభవంగా శ్రీనివాసకల్యాణం

మహాకుంభమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఏర్పాటు చేసిన శ్రీవారి నమూనా ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం శ్రీనివాసకల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం ఈకార్యక్రమాలు నిర్వహించింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో దువ్వాడ, మాధురి



ఏక్తా కపూర్ - దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి

బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో వీడియో షూట్‌లో వివాదాస్పదం అయిన దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దీనిపై అప్పట్లో టీటీడీ కేసు కూడా పెట్టిన విషయం తెలిసిందే. ఈసారి ఎటువంటి వీడియో హంగామా లేకుండానే వారు శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అలాగే శనివారం రాజస్థాన్ గవర్నర్ హరిబౌ కిషన్‌రావు బగాడే, తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ప్రముఖ సినీ నిర్మాత ఏక్తా కపూర్, టీటీడీ మాజీ జేఈవో శ్రీనివాసరాజు కూడా స్వామి దర్శనం చేసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

హుండీ ఆదాయం రూ.3.15 కోట్లు



తిరుమల వేంకటేశ్వరస్వామికి గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించగా రూ.3.15 కోట్లు ఆదాయం లభించింది.

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 61,142

తలనీలాలు సమర్పించినవారు: 19,736



పక్షులు.. పడవలు.. పర్యాటకులు..

అంబరాన్నంటిన పక్షుల పండుగ

ఏటా విహంగ ప్రేమికుల మనసు దోచుకుంటున్న ఫ్లెమింగో ఫెస్టివల్ సుమారు పాతికేళ్ల క్రితమే శ్రీకారం చుట్టుకొంది. దేశంలో మరెక్కడా లేనివిధంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవానికి బీజం పడిన నాటి విశేషాలను ఒకసారి మననం చేసుకుందాం.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

విహంగ వేడుక.. ఇంతింతై..

2000లో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ పనిచేశారు. ఈ సయంలో దొరవారిసత్రం మండలం కలగుంట రైల్వే వంతెన ప్రాంతంలో వేల సంఖ్యలో చక్కర్లు కొడుతున్న పక్షుల సమూహాలు ఆయనను ఆకర్షించాయి. అవి నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం విడిదిలోని విదేశీ విహంగాలని తెలుసుకున్నారు. వీటిపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. నాటి శాసన సభ్యుడు పరసా వెంకటరత్నయ్య, టీడీపీ నేత వేనాటి రామచంద్రారెడ్డిలతో తన ఆలోచనలను పంచుకున్నారు. పక్షులతో విడదీయరాని బంధమున్న ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు వచ్చేలా పండగ నిర్వహించాలని సంకల్పించారు. ఫలితంగా నేలపట్టులో 2000 జనవరిలో పక్షుల పండుగ ప్రారంభమైంది. 2001లో సూళ్లూరుపేట వేదికగా నేలపట్టు, పులికాట్ సరస్సుల్లో ఫ్లెమింగో పేరిట జిల్లా స్థాయిలో పండుగ నిర్వహించారు. 2002లో అదే ఉత్సాహం కొనసాగించారు. వేడుక పుణ్యమాని నేలపట్టు ప్రాంతంలో పలు అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టుకున్నాయి. 2003 ఫెస్టివల్ సమయానికి నేలపట్టులో రోడ్లు, టూరిజం భవనాలు, దొరవారిసత్రంలో టూరిజం హోటల్, తడలో టూరిజం హోటల్‌ను నెలకొల్పారు.

2016లో స్టేట్ ఫెస్టివల్‌గా..

2004, 2009లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఫ్లెమింగో ఫెస్టివల్‌ను కొనసాగించింది. 2009లో టీడీపీ ఎమ్మెల్యేగా మళ్లీ గెలిచిన పరసా వెంకటరత్నయ్య నాటి ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డితో కలిసి చొరవ తీసుకుని పక్షుల పండుగ కొనసాగేలా చూశారు. 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో చంద్రబాబు 2016లో ఈవేడుకను ఏపీ టూరిజం క్యాలెండర్‌లో చేర్చారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. అయితే విశేష జనాదరణ కలిగిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను గత వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. 2019లో అధికారంలోకి వచ్చాక 2020లో మొక్కుబడిగా జరిపింది. తర్వాత నాలుగేళ్లు నిర్వహించలేదు. టీడీపీ అధికారంలోకి రావడంతో పక్షుల పండుగకు ఇప్పుడు మళ్లీ ప్రాణం వచ్చింది.

హుషారుగా.. పడవ షికారు

పెళ్లకూరు/తడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తడ మండలం భీములవారిపాళెం వద్ద పడవ షికారుకు సందర్శకులు ఉత్సాహం చూపారు. పెద్ద సంఖ్యలో పులికాట్ సరస్సులో విహరించారు. పడవషికారులో లైఫ్ జాకెట్లతోపాటు 10 మందికి మించి వెళ్లనీవ్వకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పులికాట్ సరస్సు ఒడ్డున కొందరు నీళ్లల్లో ఆడుతూ సందడి చేశారు. అక్కడి వేదిక వద్ద స్థానిక కళాకారులు నృత్య ప్రదర్శన పాటలతో అలరించారు. అక్కడే విధుల్లో ఉన్న పెళ్లకూరు ఎంపీడీవో ప్రమీలారాణి బుల్లెట్ బైక్ పాటకు డ్యాన్స్ వేసి ఉత్సాహపరిచారు.

మొదటిసారి పడవ ప్రయాణం



మొదటిసారి పడవ షికారుకు వచ్చా. నీళ్లల్లో పడవ వెళ్తుంటే ఆనందంతో కేరింతలు కొట్టాలనిపించింది.

- విరోనిక, 6వ తరగతి, నాయుడుపేట

అహా.. వలస పక్షుల విన్యాసాలు



పులికాట్ సరస్సులో ఫ్లెమింగోలను చూడాలని వచ్చాం. వీటి విన్యాసాలను చూస్తుంటే అబ్బురపరుస్తున్నాయి. పిల్లలు వాటిని చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

- పూజిత, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, బుచ్చినాయుడుకండ్రిగ



ఫ్లెమింగో ఫెస్టివల్ వేదికపై పర్యాటక బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

నేలపట్టు కిట.. కిట!





దొరవారిసత్రం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ మొదటి రోజైన శనివారం నేలపట్టు పక్షుల కేంద్రానికి సందర్శకులు క్యూకట్టారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు, చిత్తూరు, తమిళనాడు, ప్రకాశం జిల్లాల నుంచీ భారీగా తరలి వచ్చారు. కుటుంబ సమేతంగా.. చంటి బిడ్డలతో, దివ్యాంగులు, వృద్ధులు సైతం పక్షుల వీక్షణకు విచ్చేశారు. మంచి నీటి చెరువుల్లో విడిదిలో ఉన్న విహంగాలను వీక్షించారు. ఓ వైపు పక్షుల కేంద్రంలో పక్షులు తమ సంతతిని వృద్ధి చేసుకొనే పనిలో ఇప్పటికే పిల్లలను పొదిగాయి. వాటి చప్పుళ్లతో పాటు సందర్శకుల రాకతో నేలపట్టు సందడిగా మారింది. చెరువు కట్టలపై జనం కిక్కిరిశారు. వీరిని అదుపు చేయడం వలంటీర్లకు పెద్ద పనిగా మారింది. ఇక, బైనాక్యూలర్లు సరిపడా లేకపోవడంపై సందర్శకులు అసంతృప్తి చెందారు. ఎక్కువ మంది సందర్శకులు తమతో తెచ్చుకొన్న కెమెరాలతో పాటు సెల్‌ఫోన్లలో పక్షుల ఫొటోలు తీస్తూ కనిపించారు. తామూ ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. ఇక, ఈసీ కేంద్రంలో పక్షుల చిత్రాలు, శాండ్ ఆర్ట్, ఫిల్మ్ షో, పెలికాన్ అతిథి గృహాల వద్ద స్థానిక విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. మరోవైపు ఆకతాయిలు, చిల్లర దొంగల ఆటకట్టించేందుకు పోలీసులు పక్షుల కేంద్రంలోని పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఉరితాడులా వన్యప్రాణి చట్టాలు

ఫ్లెమింగో సభలో మాజీ ఎమ్మెల్సీ వాకాటి

సూళ్లూరుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సు పై ఈ ప్రాంతంలో దాదాపు 10 వేల మందికి పైగా మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారని, అంతేకాకుండా పులికాట్ సమీపంలో ఇరకం, వేనాడు దీవులు, కొరిడి-పేర్నాడు తీర ప్రాంత గ్రామాలు ఉన్నాయని గ్రామాల్లో అభివృద్ధి చేయాలన్న, రోడ్లు నిర్మాణాలు చేపట్టాలన్న వన్యప్రాణి చట్టాలు ఉరితాడులా మారాయని మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న షార్ కేంద్రానికి మాత్రం చట్టాలు వర్తించవా? సరస్సు పై ఆధారపడి జీవనం సాగించే వారికి మాత్రం చట్టాలు వర్తిస్తాయా? ప్రభుత్వం దీని పై చొరవ తీసుకొని ఈ ప్రాంతాల అభివృద్ధికి అడ్డంకులు తొలిగేలా కొన్ని సడలింపులు తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి పరసా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పక్షుల పండుగ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గత ప్రభుత్వం పక్షుల పండుగ నిలిపివేసింది

● వైసీపీ నేత సంచలన వ్యాఖ్య

సూళ్లూరుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వం 2020 తరువాత పక్షుల పండుగ నిలిపివేసిందని వైసీపీకి చెందిన సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవ సభలో చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఆర్‌అండ్‌బీ రోడ్లు దారుణంగా దెబ్బతిని గుంతలమయమైపోయాయని అన్నారు.ప్రస్తుత ప్రభుత్వం ఆ రోడ్లకు మరమ్మతులు చేస్తోందన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సన్నిహిత కుటుంబంగా పేరున్న దబ్బల రాజారెడ్డి కుమారుడు వారి గత ప్రభుత్వంలోని లోపాలను ఎత్తిచూపుతూ మాట్లాడడంపై పలువురు చర్చించుకున్నారు.

కోస్టల్ కారిడార్‌లో పర్యాటక అభివృద్ధి చేస్తాం

● నేలపట్టులో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్



నేలపట్టులో బైనాక్యూలర్ ద్వారా పక్షులను వీక్షిస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

దొరవారిసత్రం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 970 కి.మీ మేర ఉన్న కోస్టల్ కారిడార్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విదేశీ విహంగాలు విడిది చేసే నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని శనివారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈసీ కేంద్రంలోని పక్షుల జీవన చిత్రాలను తిలకించారు. చెరువు కట్టపై నుంచి బైనాక్యూలర్ ద్వారా పక్షులను వీక్షించారు. నేలపట్టు ప్రకృతి సిద్ధమైన, అరుదైన కేంద్రమని పేర్కొన్నారు. నేలపట్టు ప్రాముఖ్యత, విడిది చేసే పక్షుల జీవన శైలి గురించి డీఎఫ్‌వో హారిక వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. నేలపట్టును టూరిజంపరంగా మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతోనే ఇంతటి జనాదరణ ఉన్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహించలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి రాగానే పక్షుల పండుగ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంత్రి వెంట గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎఫ్ఆర్‌వో సౌజన్య, తహసీల్దారు శైలాకుమారి తదితరులున్నారు.

పర్యావరణం.. పరిశ్రమలపై శ్రీసిటీలో సదస్సులు

శ్రీసిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా శనివారం 'పర్యావరణం.. పరిశ్రమలు'పై శ్రీసిటీలో సదస్సు నిర్వహించారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) సదస్సులో పర్యావరణ నిర్వహణ, సామాజిక స్పృహ అంశాలను చర్చించారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌లో శ్రీసిటీ పాల్గొనడం సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ పట్ల దాని నిబద్ధతకు నిదర్శనమని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. జీవ వైవిధ్యాన్ని రక్షించడానికి, ప్రకృతి సమతుల్యతను పెంపొందించడానికి పరిశ్రమలు, స్థానికుల సహకారం అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణతో వ్యాపార లక్ష్యాలను సమతుల్యం చేయడానికి సీఎస్ఆర్ కార్యక్రమాలు చేపట్టాలని అటవీశాఖ కన్జర్వేటర్ సి.సెల్వం కోరారు. పులికాట్ సరస్సు, వలస పక్షుల నివాసాల రక్షణకు కార్పొరేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తూ బీఎన్‌హెచ్ఎస్ డైరెక్టర్ కిషోర్ రితే ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. ఇక్కడ హరిత పరిశ్రమలను మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని శ్రీసిటీ చైర్మన్ సి.శ్రీనిరాజు తెలిపారు. అభివృద్ధితో పాటు ప్రకృతి పరిరక్షణపైనా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పులికాట్ సరస్సును కాపాడుకోవడానికి సమష్టి, నిరంతర కృషి అవసరమని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. దీనికి ఫ్లెమింగో ఫెస్టివల్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. శ్రీసిటీ పరిశ్రమల సీఎస్ఆర్ ప్రయత్నాలను అభినందిస్తూ ఐఎంవోపీ, కెల్లాగ్స్, పార్సన్ ప్యాకేజింగ్స్,ఇసుజు మోటార్స్, టీహెచ్‌కే, కోల్గేట్ పామోలివ్,డైకి అల్యూమినియం, బెర్గెన్‌పైప్స్, డానియేలీ, హమిల్టన్, ఆస్ట్రోటెక్, పియోలెక్స్, ఎస్ఎంసీసీ, వెస్ట్ ఫార్మా పరిశ్రమల అధికారులకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. క్రియా విశ్వ విద్యాలయంలో జీవ వైవిధ్యం, చిత్తడి నేలల సంరక్షణపై రెండు రోజుల సమావేశం కూడా బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ(బీఎన్‌హెచ్ఎస్)కి చెందిన డాక్టర్ సత్యసెల్వం అధ్యక్షతన శనివారం ప్రారంభమైంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్), పక్షి శాస్త్ర నిపుణుల భాగస్వామ్యంతో జరిగిన ఈ సమావేశంలో వృక్ష, జంతు వైవిధ్యం, మత్స్య, పర్యాటక ప్రయోజనాలు, హైడ్రోలాజికల్ డైనమిక్స్, వాతావరణ మార్పు ప్రభావాలు, కాలుష్యం తగ్గించడం తదితర ప్రయత్నాల్లో సమాజ భాగస్వామ్యంపై చర్చించారు.

నేటి కార్యక్రమాలిలా..

తడ, ఆంధ్రజ్యోతి: ఆదివారం జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో సినీ సంగీత దర్శకుడు రఘు కుంచె, గాయని మంగ్లీ పాల్గొననుండగా, బిగ్‌బాస్ ఫేమ్ అమరెడ్డి, రవి యాంకర్లుగా వ్యవహరించనున్నారు.



సీఎస్ఆర్ బహుమతి అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నేడు ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్సు లాబొరేటరీ ప్రారంభం



తిరుపతి(నేరవిభాగం), జనవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రూ.3.6 కోట్లతో నిర్మించిన ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్సు లాబొరేటరీని ఆదివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ ఏర్పాట్లపై అదనపు ఎస్పీ వెంకట్రావు, జీడీ ఈశ్వరయ్య, ఎంటీవో రాజశేఖర్, ఫోరెన్సిక్ సిబ్బందితో ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ సమీక్షించారు. ఈ ఫోరెన్సిక్ లేబొరేటరీ జిల్లా భద్రతా రంగానికి, న్యాయ వ్యవస్థకు ఉపయోగపడుతుందని తెలిపారు.

జవహర్ నవోదయ పరీక్షకు 1,519 మంది హాజరు

తిరుపతి(విద్య), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ స్కూళ్లలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగిందని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. తిరుపతి నగరంలోని రెండు కేంద్రాలతో పాటు గూడూరు, కోట, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, పుత్తూరు, సత్యవేడు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో మొత్తం 10 కేంద్రాల్లో పరీక్ష జరిగిందని, 2,313 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, 1,519 మంది హాజరుకాగా 794 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు అదనపు బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా సందర్శకుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. సూళ్లూరుపేట కేంద్రంగా నాయుడుపేట వయా నేలపట్టు, భీమునివారిపాలెం, షార్ వయా అత్తికానితిప్పలకు ఒక్కోటి చొప్పున, నెల్లూరుకు 3 బస్సులను ఏర్పాటు చేశారు. ఇక తిరుపతి-సూళ్లూరుపేట మధ్య రెగ్యులర్‌గా తొమ్మిది తిరుగుతుండడంతో అదనపు బస్సులు అవసరపడలేదు. సందర్శకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రజారవాణాధికారి జి.నరసింహులు కోరారు.

పుత్తూరు వార్తలు

స్వచ్ఛపుత్తూరు లక్ష్యంగా..
స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌కు శ్రీకారం


పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ పుత్తూరు లక్ష్యంగా పరిసరాల పరిశుభ్రతలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ.. చెత్త నిర్వహణ ఒక్క పారిశుధ్య కార్మికులకు చెందినదిగా భావించరాదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్ జయప్రకాష్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో తహసీల్దార్ జరీనా ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది కార్యాలయ ఆవరణ శుభ్రం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ వడమాలపేటలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు పంచాయితీ కార్యదర్శి రితేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు పలువురి నివాళి

● ఆకట్టుకున్న ఎగ్జిబిషన్.. రక్తదానం చేసిన యువత


ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పార్టీ శ్రేణులు, అభిమానులు

పుత్తూరు అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని పుత్తూరులో టీడీపీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ కూడలిలో టీడీపీ పట్టణ అధ్యక్షులు జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ఫొటోల ప్రదర్శన ఆకట్టుకుంది. తిరుపతి సంకల్ప ఆసుపత్రి వారు చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. యువత రక్తదాన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవ నాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ వాసు, ఎస్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ చెంచయ్య, మాజీ ఎంపీపీ అమ్ములు, హేమాద్రి, మాజీ మున్సిపల్ ఛైర్మన్‌లు యుగంధర్, అంకయ్య, ఆనంద్, దిలీప్ రాయల్, నారాయణబాబు, రవిశంకర్ రాజు, కృష్ణ రాయల్, మైనారిటీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పుత్తూరు ఎంబీ రోడ్డులో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పరమేశ్వర మంగళం ఎంపీటీసీ శ్రీజ బాలాజీ నాయుడు, దాసరి విజయ్ చౌదరి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకుల నివాళి

వడమాలపేట: వడమాలపేటలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, స్థానికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరులో కానరాని స్వచ్ఛాంధ్ర: సీపీఎం

పుత్తూరు టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండల పరిధిలోని పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కనపించడం లేదని శనివారం సీపీఎం కార్యదర్శి వెంకటేష్ ఆరోపించారు. మున్సిపాలిటీలోని 13వ వార్డు నందిమంగళంలో మురుగు కాల్వలు శుభ్రంగా లేవని, చెత్తా చెదారాలతో దర్శనం ఇస్తున్నాయని ఆరోపించారు. అన్ని వార్డుల్లో ఇదే పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పటికైన సీఎం ఇచ్చిన ఆదేశాలను మున్సిపల్ కమిషనర్ ఆచరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రేపు జాబ్ మేళా

పుత్తూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 20వ తేదీ సోమవారం మూడు బహుళ జాతి కంపెనీలు జాబ్ మేళా నిర్వహిస్తున్నాయని ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి, సీడాప్, డీఆర్డీఏలు సంయుక్తంగా ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. టెక్‌మహీంద్ర, డిక్సాన్, అపోలో ఫార్మాసిస్ వంటి కంపెనీలు నిర్వహించే ఈ మేళాలో పాల్గొనేందుకు టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదివిన 30 ఏళ్ల లోపు వయస్సున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు రసూల్ 63009 54441, ధనంజయ 79935 02145లను సంప్రదించాలని తెలిపారు.

ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లకు నోటీసులు

పుత్తూరు అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పుత్తూరు హోటల్స్‌లో ఆహారం ప్రమాణాలు పాటించడం లేదని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ తెలిపారు. రెండు రోజుల క్రితం ఐదు హోటళ్లలో చేపట్టిన తనిఖీల్లో కిచెన్‌లో అపరిశుభ్ర వాతావరణంతో పాటు ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని తేలిందన్నారు. ఇందుకు గాను చిక్‌బన్, ఆలీబాబా, కజారా, ఏ5 హోటల్స్‌లో తనిఖీలు చేశామన్నారు. వీరికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. వారం రోజుల గడువులో సూచనలు పాటించని పక్షంలో కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఫుడ్ శాంపిల్స్ కూడా ల్యాబ్‌కు పంపామన్నారు. రెండు వారాల్లో వచ్చే నివేదిక ఆధారంగా కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఒక హోటల్‌కు ఫుడ్ లైసెన్స్ గడువు ముగిసిందని, ఆ హోటల్ యజమానికి కూడా నోటీసు జారీ చేశామన్నారు. ఇక్కడి హోటల్స్‌లో బిరియాని వంటి నాన్ వెజ్‌లను ఒక్కసారిగా వండిపెడుతున్నారని, తిరిగి వేడి చేసి ఇస్తున్నారని గుర్తించామన్నారు. ఎప్పటికప్పుడు వండిన ఆహారం మాత్రమే వడ్డించాల్సి ఉందన్నారు. హోటల్స్ యాజమాన్యానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు.

యానాదుల భూముల ఆక్రమణపై నిరసన

పుత్తూరు టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపాలకృష్ణపురం యానాదుల భూముల ఆక్రమణపై శనివారం పుత్తూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద యానాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘ నాయకులు నందయ్య మాట్లాడుతూ తొరూరు లెక్క దాఖలా సర్వే నెంబర్ 348, 355లో యానాదులు మామిడి చెట్లు సాగు చేసుకుని జీవిస్తున్నారని, నేషనూరుకు చెందిన మనోహర్ రెడ్డి ఆ భూమి తన పేరుమీద ఉందని యానాదులను బెదిరించారని తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించగా, ఆయన స్పందించి విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నందయ్య తెలిపారు. దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య, గ్రామస్థులు రామచంద్రయ్య, కుమార్, రామయ్య, నాగమ్మ, సురేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి


చిన్నపాటి విమానాన్ని ఎగురవేస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు



షార్ స్టాల్స్‌లో రాకెట్, ఉపగ్రహ నమూనాలు





పర్యాటకులతో కిటకిటలాడుతున్న పడవలరేవు - నేలపట్టులో విద్యార్థులు

పులకించిన పులికాట్ తీరం

సూళ్లూరుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగతో పులికాట్ తీరం పులకించింది. శనివారం ఉదయం పండుగ ప్రారంభోత్సవం సమయానికి సందర్శకులు తక్కువగా ఉన్నా మధ్యాహ్నం 4 గంటల నుంచి పులికాట్ తీరం పర్యాటకులతో కళకళలాడింది. పులికాట్ తీరం వెంబడి జనం పక్షులను తిలకిస్తూ సెల్ఫీలు తీసుకొంటూ సందడి చేశారు. అట్టకాని తిప్ప వద్ద ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో ఫ్లెమింగోలతో పాటు, పులికాట్ అడవుల్లో లభించే మొక్కలు, జంతువులను ప్రదర్శనశాలలో పెట్టి సందర్శలకు వివరాలను తెలియజేసే విధంగా ఏర్పాట్లు చేశారు. అట్టకాని తిప్ప వద్దనున్న పర్యావరణ విజ్ఞాన కేంద్రం, పులికాట్ సరస్సును జర్మనీ దేశస్తులు సందర్శించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా సాయంత్రం అట్టకానితిప్ప వద్ద ఏర్పాట్లను పరిశీలించి అక్కడున్న పర్యాటకులతో కాసేపు సరదాగా మాట్లాడారు.

ఆకట్టుకుంటున్న షార్, వన్యప్రాణి స్టాల్స్

పక్షుల పండుగ పురస్కరించుకొని సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో షార్, వన్యప్రాణి విభాగం ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. షార్ ఆధ్వర్యంలో న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్, మానవ సహిత ప్రయోగానికి పంపే వ్యోమనౌక, చంద్రయాన్-3 ఉపగ్రహం, షార్ నుంచి ప్రయోగించిన వాహక నౌకలు, ఉపగ్రహాలను ఏర్పాటు చేశారు. వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో పులికాట్, నేలపట్టులో పక్షులు చక్కర్లు కొట్టే నమూన, సర్పాలు, జింకలు, పులులు తదితర జంతువులు సంచరించే నమూనాలు సందర్శకులను ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. అలాగే వ్యవసాయ శాఖ మందుల పిచికారీ చేసే డ్రోన్‌లను ప్రదర్శించి సందర్శకులకు సూచనలు ఇస్తోంది. అదేవిధంగా శ్రీసిటీలో పరిశ్రమల నమూనాలు, పశుసంవర్ధకశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ఒంగోలు కోడె దూడలు ఆకర్షణగా నిలిచాయి.

ఉత్సాహంగా క్రీడలు

ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన క్రీడల పోటీలు ఉత్సాహం, ఉల్లాసంగా సాగాయి. మంత్రి కందుల దుర్గేష్ క్రీడలను ప్రారంభించారు. కబడీ, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. అలాగే కోటపోలూరు హైస్కూల్ మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు.




వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్ - కూరగాయలతో పక్షులు - ఇవి బొమ్మలే - ఇవి మాత్రం నిజమైనవే



పురాణాల నుంచి ఫ్లెమింగ్ ఫెస్టివల్‌కు పౌరాణిక పాత్రలు - కళాకారుల నృత్య ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులతో పక్షుల పండుగకు వచ్చిన జనాలను ఉక్కిరిబిక్కిరి చేసింది. చిరుజల్లులు కురిశాయి. అయినా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న జనం తమ సీట్ల నుంచి కదలలేదు. సినీ నటుడు, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి హాస్యవల్లరితో అలరించగా, ఆట పాటలతో కళాకారులు జనాలను మైమరిపించారు. శనివారం సాంస్కృతిక కార్యక్రమాలతో పక్షుల పండుగ పూర్తిగా విజయవంతమైంది.



గూడూరులో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, నాయుడుపేటలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకుల నివాళులు

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, చిల్లకూరు, డక్కిలి, వెంకటగిరి, పెళ్లకూరు, తడ, చిట్టమూరు, కోట, వాకాడు, బాలాయపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. గూడూరు పట్టణంలోని గమళ్లపాళెంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే సునీల్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళుల ర్పించారు. టీడీపీ కార్యాలయం వద్ద అన్నదానం, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా సొసైటీ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సూళ్లూరుపేట రైల్వేగేటు వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిల్లకూరు దర్గా వద్ద పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, బెల్లంకొండ రాజేంద్ర, డక్కిలిలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, వెంకటగిరి పట్టణంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగోటి నాగేశ్వరరావు, ఎంపీపీ తనూజరెడ్డి, శివారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీరామదాసు గంగాధర్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, అండమాన్ నికోబార్ దీవుల్లో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు, పెళ్లకూరు మండలం కొత్తూరులో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, తడ బజారుకూడలిలో టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, చిట్టమూరులో టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు, కోట పట్టణంలో టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, విద్యానగర్‌లో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి, వాకాడులో తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి కుంచం దయాకర్, బాలాయపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు.


సూళ్లూరుపేటలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే విజయశ్రీ నివాళి

పోలేరమ్మ హుండీ లెక్కింపు



నాయుడుపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు, ఈవో రవికృష్ణ సమక్షంలో శని వారం లెక్కించారు. రెండు నెలల 19 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3,08,360 నగదు, 3.06 గ్రాముల బంగారం లభించింది.

టీడీపీ సీనియర్ నేత తోటయ్య మృతి



చిట్టమూరు, జనవరి18 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం పల్లంపర్తి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచు తీపలపూడి తోటయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు, నాయకులు సంతాపం తెలిపారు.

గొబ్బెమ్మల నిమజ్జనం

కోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల స్వర్ణముఖినదిలో శనివారం గొబ్బెమ్మల నిమజ్జనం జరిగింది. గూడలి అరుంధతీయవాడతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన గొబ్బెమ్మలను మహిళలు మేళతాళాలతో ఊరేగిస్తూ స్వర్ణముఖినదిలోని నీటిలో నిమజ్జనం చేశారు.

వైసీపీ నేత కుటుంబానికి పరామర్శ

నాయుడుపేట టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత తంబిరెడ్డి బలరామిరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి టీటీడీ మాజీ ఛైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మున్సిపల్ ఛైర్ పర్సన్ కటకం దీపిక తదితరులు నివాళులర్పించారు.

డీఎస్పీ రమణకుమార్ బదిలీ

గూడూరు అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గూడూరు డీఎస్పీ రమణకుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఆగస్టు 11వ తేదీన గూడూరు డీఎస్పీగా వీవీ రమణకుమార్ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం పలువురు డీఎస్పీలను బదిలీ చేసింది. ఇందులో భాగంగా గూడూరు డీఎస్పీగా పనిచేస్తున్న రమణకుమార్‌ను బదిలీ చేస్తూ విజయ వాడలోని హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఆయన స్థానంలో గీతా కుమారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పొలంలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

చిట్టమూరు, జనవరి18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాడిమేడు అనగొల్లపాళెం రోడ్డు సమీపంలో శనివారం ఉదయం ఆర్టీసీ బస్సు పొలంలోకి దూసుకెళ్లింది. కోట నుంచి సూళ్లూరుపేట వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్టీరింగ్ దెబ్బతినడంతో అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎవరికీ గాయాలు కాలేదు.

వెంకటగిరి క్రీడలకు పుట్టినిల్లు


బహుమతి అందుకుంటున్న నాయుడుపేట గేల్ ఫ్రెండ్స్ జట్టు

వెంకటగిరి టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వెంకటగిరికి క్రీడలకు పుట్టినిల్లు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీఎన్ఆర్ సోషల్ సర్వీస్ ట్రస్టు గంగోడు నాగేశ్వరరావు అన్నారు. జీఎన్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీల్లో ఐదు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విజేతగా నిలిచిన గేల్ ఫ్రెండ్స్‌కు మెడల్, కప్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన వడమాలపేట, మూడవ స్థానంలో నిలిచిన వెంకటగిరి యువసేన టీమ్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికల్లు రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథం(మురగ), సీఐ ఏవీ రమణ, శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, తదితరులు

నాయుడుపేట టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మన ఇంటి వలే పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటురోగాలు ప్రబలకుండా చూడవచ్చని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయం నుంచి శనివారం ఎంపీడీవో సురేష్‌బాబు, మున్సిపల్, మండల పరిషత్, సచివాలయ సిబ్బందితో కలసి స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, పల్లమాల రామిరెడ్డి, కార్యదర్శి గోపాల్, శ్రీలక్ష్మి, శ్రీను, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాల భారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం ఎమ్మెల్యే చీపురు చేతబట్టి వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా జరిగిన సదస్సులో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఫారెస్టు కన్జర్వేటర్ సి.సెల్వం, బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ(బీఎన్‌హెచ్‌ఎస్) సత్యసెల్వం, శ్రీసిటీ ఛైర్మన్ సి.శ్రీనిరాజు, మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వివిధ పరిశ్రమల ఉన్నతాధికారులు

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు


ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

నాగలాపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి - చెన్నై జాతీయ రహదారిపై అతివేగంగా వస్తున్న కారు.. ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటన నాగలాపూరం మండలం కారణి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శనివారం తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై సత్యవేడు నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు కారణి వద్ద ఆగింది. తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న చెన్నైకు చెందిన నలుగురు కనిమొళి(30), అశ్విన్‌కుమార్(34), శ్రీనిధి(32), సతీష్‌కుమార్(40)కు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో ఉత్తుకొట్టై ఆస్పత్రికి తరలించారు. బస్సులోని ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆహార భద్రతా నియమాలు పాటించాలి

రేణిగుంట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): హోటల్ నిర్వాహకులు ఆహార భద్రతా నియమాలు పాటించాలని జిల్లా ఆహార భద్రత అధికారులు జగదీష్, నర్మద సూచించారు. రేణిగుంట పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శనివారం ఆహార భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆహార భద్రత మండలి సర్టిఫికెట్ పొందిన ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ అండ్ సర్టిఫికేషన్ సెంటర్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జగదీష్, నర్మద మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా ఫాస్ట్ ట్రాక్ ద్వారా ట్రైనింగ్ తీసుకుని ధ్రువీకరణపత్రం పొందాలని తెలిపారు. ఆహారం విషయంలో నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవోపీఆర్డీ ప్రభురావు, ఫుడ్ సేఫ్టీ ఆడిటర్ ట్రైనర్ మహ్మద్‌జైద్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ నాగరాజు, స్టేట్ కో ఆర్డినేటర్ దాస్, జిల్లా కోఆర్డినేటర్ వెంకట రామారావు, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ సునీల్, లోకేష్, విష్ణు, సంజీవి, నాగరాజు, సతీష్, హోటల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి చంద్రబాబు


చెక్కులు అందజేస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నిత్యం పేదల పక్షపాతిగా వారి అభ్యున్నతి కోసమే పరితపిస్తారని మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో శనివారం అర్హులైన పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని పదిమంది అర్హులకు రూ.11లక్షలు నిధులను సంక్రాంతి సందర్భంగా ప్రభుత్వం విడుదల చేయడం హర్షనీయమన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు కంఠా రమేష్, ప్రకాష్ నాయుడు, చెంచయ్య నాయుడు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

శ్రీకాళహస్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఆరుగురికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలో శనివారం పలుచోట్ల టూటౌన్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా.. మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారిని న్యాయస్థానంలో హాజరు పరచడంతో ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.60వేలు జరిమానా విధించినట్లు సీఐ వెల్లడించారు.

మన్నవరంలో క్రికెట్ టోర్నమెంట్


క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న చెంచయ్యనాయుడు

శ్రీకాళహస్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి రూరల్ ప్రాంతాల్లో ఉన్న యువత క్రీడల్లో రాణించేందుకు సంక్రాంతి సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు ఆధ్వర్యంలో మన్నవరంలో ఆర్‌సీఎన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గత పదిరోజులుగా జరిగిన ఈపోటీల్లో 22 జట్లు పాల్గొనగా, అందులో విజేతగా కమ్మకొత్తూరు, ద్వితీయస్థానంలో రాజుగుంట నిలిచాయి. శనివారం చెంచయ్య నాయుడు విజేతలకు జ్ఞాపికలు, రూ.30వేలు, రన్నర్స్‌గా రూ.20వేలు, జ్ఞాపికలు అందజేశారు. మ్యాన్ ఆఫ్‌ది టోర్నమెంట్‌కు రూ.5వేలు అందజేశారు.

గోదాములను శివారు ప్రాంతాలకు తరలించండి

రేణిగుంట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గృహసముదాయాల మధ్యలో ఏర్పాటు చేసిన గోదాములను అధికారులు శివారు ప్రాంతాలకు తరలించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. శనివారం రాత్రి స్థానిక అన్నదాన సత్రం వీధిలో ఇంటి నిర్మాణానికి భారీ కంకర మిక్సర్ వాహనం రావడంతో ఆ వీధిలోని డిష్ తీగలు తెగిపోయాయి. దీంతో స్థానిక మహిళలు ఆ వాహనాన్ని ఆపేశారు. వారు మాట్లాడుతూ పోలీసులు, పంచాయతీ అధికారులు స్పందించి గోదాములను శివారు ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు.

చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

రేణిగుంట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కరకంబాడి చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలోని కరకంబాడి చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతుందని స్థానికులు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా సుమారు 50 నుండి 55 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మృతదేహం ఉంది. కుడి చేతికి రెండు రాళ్ల వెండి ఉంగరాలు, మెడలో ఎర్రటి సాయిబాబా డాలర్ వేసుకుని ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్ తెలిపారు.

సకాలంలో రుణాలు చెల్లించండి

రేణిగుంట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సకాలంలో రుణాలు చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని సహకార బ్యాంకు నోడల్‌ఆఫీసర్ కె.సురేష్‌బాబు నాయుడు కోరారు. స్థానిక రేణిగుంట సహకార బ్యాంకు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడంలో రేణిగుంట సహకార బ్యాంకు ముందంజలో ఉందని తెలిపారు. ఏపీఎం పళని, బ్యాంకు మేనేజరు పార్వతి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం బ్యాంకు అధికారులు రుణాలు అందిస్తున్నారని చెప్పారు. ఖాతాదారులకు బ్యాగులు పంపిణీ చేశారు. బ్యాంకు సూపర్‌వైజర్ శరత్‌కుమార్, నాగలక్ష్మి, ఏపీఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆర్ఎంకు సన్మానం

ఏర్పేడు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నరసింహులును శనివారం ఏపీపీటీడీ బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంబేడ్కర్ స్టార్ కృష్ణ కలిసి సన్మానించారు. దళిత బహుజన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు

వరదయ్యపాళెం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురం వంతెన వర్షాలకు గతుకులమయంగా మారింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుర్తించిన తహసీల్దారు రాజశేఖర్ గుంతలను చదును చేయించి మెటల్‌ను వేశారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తొలగాయి. డీటీ సుబ్బయ్య, వీఆర్వో సుజితమోహన్, వీఆర్‌ఏ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధూర్జటి కళా ప్రాంగణం, స్వామి అమ్మవార్ల పురవీధుల ఉత్సవంలో ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలకు ఆసక్తి గల కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈవో బాపిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను పూర్తి వివరాలతోపాటు ఫొటో, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్సును జత చేసి ఈ నెల 20వ తేదీ లోపు ఆలయ కార్యాలయానికి నేరుగా కానీ, పోస్టుద్వారా కాని అందజేయాలన్నారు.



శ్రీకాళహస్తిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బృందమ్మ - పిచ్చాటూరులో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

శ్రీకాళహస్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ అన్నారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం టీడీపీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. బొజ్జల బృందమ్మ ఆధ్వర్యంలో పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆర్టీసీ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో 20వ వార్డులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బొజ్జల బృందమ్మ మొక్కలు నాటారు. తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్ నాయుడు, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెంచయ్య నాయుడు, నాయకులు ఉమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు సత్రవాడ ప్రవీణ్, నాయకులు ప్రకాష్ నాయుడు, ప్రసాద్ నాయుడు, హరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యుగ పురుషుడు ఎన్టీఆర్: ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు యుగపురుషుడని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆయన వరదయ్యపాళెంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి పేదలకు వడ్డించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో చెత్త తొలగించి మొక్కలు నాటారు. అనంతరం గోకులం షెడ్లను ప్రారంభించారు. లబ్ధిదారులు కల్యాణి-చందు, సత్య, మునస్వామి-సుబ్బమ్మలు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే ఆదిమూలంకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, నిర్మల్, ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి, దశరథన్, రమణయ్య, రవిరెడ్డి, బీజేపీ నాయకులు గురుదేవ్, దిలీప్ రాయల్, ఎంపీడీవో, ఎస్ఐ మల్లికార్జున్ పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరులో ఎమ్మెల్యే ఆదిమూలం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికంగా ఉన్న రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. గోవర్ధనగిరి, కీళపూడి, వేలూరు, తులసిక్రిష్ణాపురం, కొత్త గొల్లకండ్రిగ గ్రామాల్లోనూ ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.

ఏర్పేడు: మడిబాక గ్రామంలో కార్యకర్తలతో కలిసి టీడీపీ సీనియర్ నేత రాయపనేని మల్లికార్జున నాయుడు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు గాలి సుబ్రహ్మణ్యం నాయుడు, పోతుగుంట భక్తవత్సలం నాయుడు, అశోక్ నాయుడు, బాబా సాహెబ్, మధు నాయుడు, నాగరాజు, సుధాకర్, సంపూర్ణమ్మ, రానెమ్మ, తులసి, కన్నెమ్మ, రాధ, అమర, లక్ష్మి, సుబ్బమ్మ, తేజవతి, కార్యకర్తలు పాల్గొన్నారు. ఏర్పేడులో జరిగిన కార్యక్రమంలో పొన్నారావు, గురవారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, జయచంద్రారెడ్డి, గుణయాదవ్ తదితరులు పాల్గొన్నారు. పాపానాయుడుపేటలో జరిగిన కార్యక్రమంలో కృష్ణప్ప మొదలియార్, రోశయ్య, అర్జున్ బాబు తదితరులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో గిరిప్రసాద్‌రెడ్డి, నాగరాజు నాయుడు, ధనంజయులు నాయుడు, మునిరెడ్డి, సీతాపతి ఆచారి తదితరులు పాల్గొన్నారు. గోవిందవరంలో జరిగిన కార్యక్రమంలో చిరంజీవి నాయుడు తదితరులు పాల్గొన్నారు. పేదలకు అన్నదానం నిర్వహించారు.

కేవీబీపురం: కేవీబీపురంలో మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు, రైతు పార్లమెంటు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ ఎంపీపీ మణి ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి కుమార్ చేతులమీదుగా రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మణి, అయ్యప్ప, రామారావు, శివరావు, మునికృష్ణయ్య, వివేకానందరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని సత్యవేడు నియోజకవర్గ తెలుగు మహిళాధ్యక్షురాలు వరలక్ష్మి గ్రామస్థులతో కలిసి కొత్తూరు గ్రామంలోని తన ఇంటి వద్దనే ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నరేష్‌ను ఆమె దుశ్శాలువాతో సత్కరించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక బస్టాండ్ దగ్గర మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ అమలుచేసిన పథకాల గురించి వివరించారు. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో 200 మందికి అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు సుందరయ్య, సముద్రాల సుధాకర్ నాయుడు, రవి నాయుడు, వెంకటాచలం, మధు నాయుడు, మునిచంద్ర నాయుడు, కార్తిక్ నాయుడు, శ్రీనివాసులు, రమేష్‌బాబు, భాస్కర్ యాదవ్, వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మెహబాబూబ్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యవేడు: టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అన్నదానం నిర్వహించారు. టీడీపీ పరిశీలకులు చంద్రశేఖర్, కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు, నాయకులు సుందరరామిరెడ్డి, బాలసుందరం రెడ్డి, లోకయ్యరెడ్డి, మురళి(చికెన్ చిన్న), రాధాకృష్ణయ్య, శశిమోహన్ నాయుడు, దిలీప్, జగన్నాథరెడ్డి, బాబు, షణ్ముగం, సురేంద్ర రెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, హేమభూషణం, శివానందం, మోహన్, అరుల్‌నాథన్, ధనశేఖర్, మునినాథం, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఏర్పేడు మండలం మర్రిమందలో నివాళులు అర్పిస్తున్న మహిళలు


బీఎన్‌కండ్రిగలో అన్నదానం చేస్తున్న చంద్రశేఖర్ నాయుడు

నారాయణవనం: నారాయణవనంలో ఎన్టీఆర్ విగ్రహానికి జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలోని చిత్రపటానికి నివాళులు అర్పించి, పేదలకు అన్నదానం చేశారు. అలాగే మండల టీడీపీ అధ్యక్షుడు గిరిబాబు, పాలమంగళంలో మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, హరి, మాణిక్యం రెడ్డి, గోవిందస్వామి, లోకయ్య, శంకర్, మునిరాజ, శివ, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయం వద్ద నారా రోహిత్ తదితరులు

శ్రీకాళహస్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ఉమ, సీఎం చంద్రబాబు సోదరుడి కుమారుడు, సినీ హీరో నారా రోహిత్ కుటుంబ సమేతంగా దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆగమోక్తంగా పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కంచుగడప వద్ద ఉన్న అధికార నందికి ఆదివారం కుంభాభిషేకం నిర్వహిస్తారు. అందులో భాగంగా శనివారం వేదపండితులు ఆలయంలో అంకురార్పణ పూజలు నిర్వహించారు. కలశాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పిచారు. ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న సిబ్బంది, పాల్గొన్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం ఆర్డీవో కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆయన అధికారులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఆర్డీవో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, ఆశ వర్కర్లు, సంఘమిత్రలు, పంచాయతీ సిబ్బంది టీడీపీ నాయకులతో కలిసి ఆయా గ్రామాల్లో పరిసరాలను శుభ్రపరిచారు. టీడీపీ నాయకులు ముచేల భాస్కర్‌రెడ్డి, వి.భాస్కర్‌రెడ్డి, చంద్ర యాదవ్, కృష్ణారెడ్డి, శ్రీను యాదవ్, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పిచ్చాటూరు: పిచ్చాటూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో మహ్మద్‌రఫీ సిబ్బందితో కలసి పరిసరాలను శుభ్రపరచారు. తహసీల్దార్ కార్యాలయంలోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు. తులసిక్రిష్ణాపురం సచివాలయంలో గ్రామ కార్యదర్శి సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి సచివాలయ ఆవరణాన్ని పూర్తిగా శుభ్రం చేయించారు.

నారాయణవనం: నారాయణవనంలో జడ్పీటీసీ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, టీడీపీ నాయకులు భాస్కరన్, వార్డు మెంబర్లు, ఎంపీటీసీ సభ్యులు, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణ చర్యలు వెంటనే చేపడుతాం

కేవీబీపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామస్థులు, అదే గ్రామానికి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు గ్రామంలో కాలుష్యం ఏర్పడుతోందని గత నెలలో ఫిర్యాదు చేశారు. దీనిపై శనివారం డీఎల్‌పీవో ప్రభురెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో సమావేశం నిర్వహించారు. బీజే ఇన్‌ఫ్రాస్ట్రక్ యాజమాన్యంతో మాట్లాడి కాలుష్యం ఎక్కడ నుంచి ఏర్పడుతోందని ఆ ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. కంపెనీ మేనేజరు ప్రవీణ్ మాట్లాడుతూ.. ఇటీవలే ఈ కంపెనీని తాము తీసుకున్నామని, ఇకపై ఏ విధమైన కాలుష్యం గ్రామంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ ఇకపై ఏవైనా ఫిర్యాదులువస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈవోపీఆర్డీ వల్లి, గ్రామస్థులు పాల్గొన్నారు.

జ్వరంతో నాలుగేళ్ల బాలిక మృతి


దివ్యశ్రీ మృతదేహం

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాలేడు దళితవాడలోని సుబ్రమణ్యం, వెంకటరత్నం కుమార్తె దివ్యశ్రీ(4) జ్వరంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. గత మూడు రోజులుగా జ్వరంతో ఇబ్బందులు పడుతుండటంతో బీఎన్‌కండ్రిగ, శ్రీకాళహస్తి ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో శుక్రవారం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు

పిచ్చాటూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల వివరాలను ఈకేవైసీలో నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. శనివారం పిచ్చాటూరు రైతులతో ఈకేవైసీ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వానికి పంటలను అమ్ముకోవడానికి, రుణాలు పొందడానికి , పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు వర్తిస్తాయన్నారు. సత్యవేడు ఏడీ సుబ్రహ్మణ్యం, పిచ్చాటూరు ఏవో సంజీవరెడ్డి, ఎంపీఈవో సవిత పాల్గొన్నారు.

పేద ముస్లింలకు నిత్యావసర సరుకుల పంపిణీ

వరదయ్యపాళెం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లోని నిరుపేద ముస్లింలకు 25కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను శనివారం షేక్ అబ్దుల్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం నిరుపేదల దుస్థితిని ఎన్ఆర్ఐ షేక్‌బాబు నూరుద్దీన్ దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన ఆయన 30 కుటుంబాలకు వీటిని అందించారని కృతజ్ఞతలు తెలిపారు. ఖాదర్‌బాషా, అలీ, బర్కత్, ఫైజ్, అంజద్‌బాషా, బిర్యానీ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.